

రెప్పల మీద నీడలు

– అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

19

నారింజ రంగు పెయింట్ ఒలకబోస్తూ, పశ్చిమాద్రికి పయనం అయినాడు సూర్యుడు. కొంచెం, కొంచెం రంగు మారుతూ బూడిద రంగు, కొంతా, నల్ల రంగు కొంతా పులుముకుంటోంది ఆకాశం.

సూర్యోదయంతోటే వృత్తి, ఉద్యోగాల నిమిత్తం పలుప్రదేశాలకు బయలుదేరి వెళ్ళిన జనాలు అలసి, సొలసి తిరుగుప్రయాణం అయారేమో, జోకోడుతున్న చల్లగాలికి కళ్ళు మూతలు పడుతుంటే– బస్సుల నుంచి, అనేక వాహనాల నుంచి బద్ధకంగా దిగి నడక మొదలుపెట్టారు.

గుడివాడ బస్టాండ్ లో ఆగిన బస్సులో నుంచి, తన హ్యాండ్ బాగ్ భుజానికి తగిలించుకుని, చేతిలో సూట్ కేసుతో బస్ దిగింది పవిత్ర..

పుట్టి, పెరిగిన ఆ ఊరిగాలి మెత్తగా తాకి "బాగున్నావా తల్లీ?" అని పరామర్శించింది.

ఆహారం కోసం విహారానికి వెళ్ళిన పక్షులు సందడి చేస్తూ, "ఎప్పుడొచ్చావు? ఎన్నాళ్ళు ఉంటావు?" అని అడిగాయి.

పవిత్రకి ఆ మట్టిమీద కాలు ఆనగానే ఉప్పనలా వచ్చింది దుఃఖం.

రక్షణ ఇస్తున్న అమ్మ కౌగిలిలా కిందకి వంగి కౌగలించుకున్నాయి మేఘాలు.

చుట్టూ ఉన్న టీ బడ్డీలు, సోడా బండ్లు, అరటి పళ్ళ కొట్లు విద్యుద్దీపాల కాంతిని ప్రసరిస్తూ, ఆమెని చూసి ఆప్యాయంగా నవ్వాయి..

ఒక్కసారి చెప్పులు విప్పి నేల మీద పాదం నొక్కి పెట్టి, మట్టి స్పర్శని అనుభూతించింది. తిరిగి చెప్పులు తొడుక్కుని, పరిసరాలు చూస్తూ మెల్లగా నడక ప్రారంభించింది.

కేవలం ఆ నేల, ఆ గాలి, ఆ పరిసరాలు వదిలిపెట్టి వెళ్లి 30 రోజులు దాటిందేమో, కానీ ఆమెకి మాత్రం చాలాకాలం క్రితమే ఆ ఊరు వదిలిపెట్టి వెళ్లినట్టు అనిపిస్తోంది. గట్టిగా నడిస్తే పది నిమిషాలు నడక. కానీ ఆమెకి ఎప్పుడెప్పుడు వెళ్లి నానమ్మ ఒడిలో వాలాలా అనిపిస్తోంది. అందుకే అటుగా వెళ్తున్న రిక్షా ఆపింది.

అతను ఆమెని చూస్తూనే, "అమ్మాయిగారూ! తవరు నాంచారమ్మ గారి మనరాలు కదూ! రండి, రండి బండెక్కండి" ఆత్మీయంగా, ఆత్మబంధువులా పలకరించి, ఒక పెడల్ మీద కాలుంచి, వెనక్కి తిరిగి సీటు దులిపి ఆహ్వానించాడు.

పవిత్ర సూట్ కేసు సీటు మీద పెట్టి, మరో వైపు నుంచి రిక్షా ఎక్కింది. గంటలు గణ,గణ శబ్దం చేస్తూ ముందుకు దూకించాడు రిక్షాని.

"అత్తారింటి కాడినించేనా తవరి రాక. అందరూ బాగుండారా ?" పూర్వ జన్మ బంధమేదో ఉన్నట్టు ఆత్మీయంగా మాట్లాడుతూ, రిక్షా తొక్కుతున్నాడు.

అవును మరి. ఒక్కటా, రెండా? పుట్టినప్పటినుంచీ తనని చూస్తూనే ఉన్నారు ఈ ఊరి జనం. తనే ఎవరినీ గుర్తు పట్టే స్థితిలో లేదిప్పుడు,,, కానీ తనని ఎవరైనా గుర్తించగలరు. ఒకవిదంగా అది ఆనందాన్ని కలిగించినా, మరో విధంగా ఇబ్బందే. ఇక్కడే జీవితాంతం ఉండి పోవాలని వచ్చింది. అలా ఉండిపొతే తెల్లారి లేచిన దగ్గర నుంచీ, ఎప్పుడు వెళ్తావు ? అనే ప్రశ్నలు గుచ్చుకుంటూనే ఉంటాయి. పవిత్రకి భయం వేసింది. కొంగు భుజం చుట్టూ కప్పుకుంది.

గాలి మరింత చల్లగా మారింది. చీకట్లను చీల్చుకుంటూ వీధి దీపాలు వెలిగిపోతున్నాయి. పవిత్ర కళ్ళు మూసుకుంది. ఎంత హాయిగా, ప్రశాంతంగా ఉంది! ఈ ప్రశాంతతని వదులుకుని శివతో ఎందుకు వెళ్లినట్టు? మూడు మూరల పసుపుతాడుతో తన మీద అంత అధికారం సంపాదించాడా? కుడిచేత్తో పుస్తెల తాడు సరిచేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త. భర్తగా కాక ఒక యజమానిలా ప్రవర్తిస్తాడా? తనేమన్నా అతని దగ్గర సేవకురాలా?

ఆమె కళ్ళ ముందు శివ కదిలాడు. అతని పక్కనే సరళ కూడా కదిలింది. నిండైన అవయవ పుష్టితో, తెల్లగా చూడగానే, మగవాళ్ళని కవ్వించే పర్సనాలిటీ. బొద్దు కిందకి జారే చీరకట్టు, బిగుతుగా ఉండే జాకెట్టు...ఆమె అందగత్తెనా? అనుమానం వచ్చింది పవిత్రకి.

అందం వేరు ఆకర్షణ వేరు, గులాబీ వేరు, మల్లె వేరు. మల్లెలు మాల కట్టి దేవుడి మేడలో, అతివల తలలో అలంకరించుకునేవి. గులాబీ డ్రాయింగ్ రూమ్ లో గాజు సీసాలో అలరించేది. ఈ రెండు అందాలకీ తేడా తెలియని పసి మనసు పవిత్రది. అందుకే ఆమెకి సరళ అందగత్తెనా? తనా? అనే అనుమానం కలిగింది. ఈ పాటికి ఇంటికి వచ్చే ఉంటాడా? తను లేకపోడం చూసి కల్లు తాగిన కోతిలా గంతులేస్తాడా? దరిద్రం వదిలింది అని సంతోషిస్తాడా?

ఆమె కళ్ళ ముందు సరళా, శివా సంతోషంతో తుళ్ళుతూ డాన్స్ చేస్తున్నట్టు కదిలారు. కన్నీళ్లు వెచ్చగా బుగ్గల్ని తాకాయి.

రిక్షా కుదుపుకి తూలిపడబోయి నిలదొక్కుకుంటూ చూసింది పవిత్ర.

రిక్షా తన కాలేజ్ ముందు నుంచి వెళ్తోంది. ఒక్కసారిగా గుండె జల్లుమంది. ఆ గేటు, విశాలమైన ప్రాంగణం, పెద్ద, పెద్ద చెట్లు... మనసంతా పరవశించింది.

ఎంత పని చేసింది తను? ఈ విద్యాలయం, తనకో మంచి భవిష్యత్తు ఇవ్వడానికి తపన పడిన ఉపాధ్యాయులు, తన ప్రియనెచ్చెలులు... దుఃఖం పొంగుకొచ్చింది.

ప్రేమ అనేది ఒక మిరుమిట్లు గొలిపే కాంతి అయితే, తనలాంటి వాళ్ళంతా ఆ కాంతి ఆకర్షణకి భ్రమపడి తిరిగే పురుగులు. ఆ కాంతి భవిష్యత్తు వెలిగించే అనుకుని దీపం అనుకుని భ్రమ పడతారు. కానీ, అది నిజానికి భవిష్యత్తుని దహనం చేసే కాగడా.

రిక్షా గేటుని సమీపిస్తుంటే గుండె దడదడలాడింది. ఆవేశంలో ఇల్లుదాటి, ఊరు దాటి, పుట్టింటికి చేరింది కానీ, ఇంట్లో అడుగుపెట్టిన తరవాత జరిగే పరిణామం ఎలా ఉంటుందో ఊహించే సాహసం కూడా చేయలేకపోయింది.

రిక్షా ఆగింది. గేటు కొంచెం తెరిచి ఉంది. పోర్టికోలో కారు కనిపిస్తోంది. కిటికీ లోంచి లోపల వెలుగుతోన్న లైట్ల వెలుగుతో బాటు, వరండాలో ఉన్న లైటు వెలుగులో మొక్కల మీద నిలిచిన నీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. సన్నజాజి పందిరి మీద నుంచి సువాసన మోసుకొచ్చింది గాలికన్య. సాయంత్రం పూటే మొక్కలకి నీళ్ళు పోస్తుంది వర్ధని. అదే గుర్తొచ్చి, ఒక్కసారిగా ఆ పరిమళం ఆస్వాదించింది.

దిగాలా? వద్దా? అన్నట్టు బిర్రబిగుసుకున్నట్టు కూర్చున్న పవిత్ర, తన పక్కన ఉన్న సూట్ కేసు తీస్తూ, "దిగండి అమ్మాయిగారూ" అన్న రిక్షా అతని స్వరం విని కొద్దిగా సర్దుకుని, నెమ్మదిగా దిగింది.

అతను సూట్ కేసు తీసుకుని గేటు పూర్తిగా తెరిచి లోపలికి వెళ్లి వరండాలో నుంచుని కిటికీ వైపు తొంగిచూసి, "అమ్మగారూ! నాంచారమ్మగారూ! మనరాలొచ్చారు." అని అరిచాడు కొంచెం గట్టిగా.

నెల రోజుల తర్వాత పుట్టింటి గుమ్మం కనిపించగానే ఆమె అడుగులు ఆగిపోయాయి.

పెళ్లయి వెళ్లినప్పుడు ఇదే గుమ్మం ఆమెను సాగనంపింది. అప్పుడు కళ్లలో కలలు. తనువంతా ప్రేమ మైకం. కళ్ళ ముందు రంగు, రంగుల భవిష్యత్తు.

ఇప్పుడు అదే గుమ్మం... కానీ చేతిలో బాగ్ తప్ప మరేమీ లేదు. గుండెల్లో మాత్రం బరువు.

ఆ బరువు వల్లనేమో కొన్ని క్షణాలు అచేతనంగా, శిలలా నిలబడిపోయింది. తరవాత మెల్లగా తడబడుతున్న అడుగులతో వరండాలోకి వచ్చి నిలబడింది. ఇంతలో ఆమె చెవులను తాకింది చిరపరిచిత స్వరం "ఎవరూ?" అంటూ. వెంటనే కాలి మువ్వల శబ్దం, తలుపు గడియ తీసిన శబ్దం రెండూ ఒకేసారి ఆమెని చైతన్యంలోకి తీసుకువచ్చాయి.

తలుపు తీసిన వర్ధని ముందు, రిక్షా అతన్ని, తరవాత అతని వెనక ఉన్న కూతురిని చూసింది.

విద్యుద్దీపాల వెలుగులో పవిత్ర, నిమ్మపండు సిల్క్ చీరలో మెరిసిపోతోంది. ఆవిడ నోటి నుంచి చిన్న కేక వెలువడింది. వేగంగా గడపదాటి వరండాలోకి వచ్చి, "పవిత్రా! నువ్వా" అంటూ గబుక్కున కూతురుని కౌగలించుకుంది.

ఆ కౌగిలింతతో అప్పటివరకు పవిత్ర మనసులో ఉన్న అనేక సందేహాలు, ప్రశ్నలు తెరచిన పంజరం తలుపుల నుంచి రివ్వున ఎగిరిన చిలుకలా ఎగిరిపోయాయి. "అమ్మా!" అంటూ ఆవిడని హత్తుకుపోయింది.

ఆ వెనుకే నాంచారమ్మ "ఎవరే! ఎవరొచ్చారు?" అంటూ నెమ్మదిగా నడుస్తూ వచ్చింది.

పవిత్రని అలాగే పట్టుకుని లోపలికి నడిచిన వర్ధని "మీ మనవరాలు. కలవరిస్తున్నారుగా ఇదిగో" అంది పవిత్ర చేయి ఆవిడకి అందిస్తూ.

"ఎవరూ! నా బంగారే! నా తల్లే! ఎట్టా ఉన్నావే అమ్మా! ఎంతకాలమైందే నిన్ను చూసి" మనవరాలి ఒళ్లంతా తడిమి, చెంపల మీదా, నుదుటి మీదా ముద్దు పెట్టుకుని, "అల్లుడొచ్చాడా?" అనడిగింది పవిత్ర భుజాల మీద నుంచి వీధి గుమ్మం వైపు తొంగిచూస్తూ.

ఊహించిన ప్రశ్నే. అయితే, ఆ ప్రశ్న ఎదురైతే ఏం చేయాలో, ఏం చెప్పాలో ఊహించలేదు పవిత్ర. అందుకే ఆమెకి సమాధానం తట్టలేదు. మౌనంగా తల్లివైపు చూసింది.

ఎన్నడూ చూడని ఒక నిర్లిప్తభావన, ఒక చిన్న విషాదం కూతురి కళ్ళలో పసిగట్టిన వర్ధని భ్రుకుటి ముడిపడింది. అత్తగారి ప్రశ్నకి సమాధానం చెప్పలేని నిస్సహాయత ఆ కళ్ళల్లో కనిపించి, వెంటనే అంది. "అతనికి హాస్పిటల్, పేషంట్లతో తీరిక ఎక్కడుంటుంది? తను మొదటిసారి మనలని విడిచి వెళ్ళింది కాబట్టి, నెలరోజులకే బెంగ పెట్టేసుకుని ఉంటుంది... బస్ ఎక్కించి ఉంటాడు. అంతేనా!" అంది కూతురి వైపు నర్మగర్భంగా చూస్తూ.

మెల్లని స్వరంతో "అవును" అంది పవిత్ర.

"రా, రా ఎప్పుడు బయలుదేరావో, స్నానం చేసిరా, ఏకంగా భోంచేద్దువుగాని". అంటూ కింద ఉన్న సూట్ కేసు తీసుకుని లోపలికి నడిచింది వర్ధని.

పవిత్ర అటూ, ఇటూ చూస్తూ "అమ్మా రిక్షా అతనికి డబ్బులివ్వాలి." అంది.

వర్ధని వెనక్కి తిరిగి చూసి, "వాడు వెళ్ళిపోయాడు... రేపు వస్తాడులే ఎక్కడికి వెళ్తాడు?" అంది.

పవిత్ర ఆవిడని అనుసరిస్తూ "నాన్న లేరామ్మా. బయట కారుందిగా " అంది.

"ఆఫీస్ నుంచి వచ్చేసారు... కాసేపు వాకింగ్ చేసి వస్తాను అని వెళ్ళారు. నువ్వు రెడీ అయేలోగా వస్తారులే" అంది ఆవిడ.

పవిత్ర నేరుగా బాత్ రూమ్ వైపు వెళ్ళింది. గోరు వెచ్చని నీళ్ళు ఒంటిని, వెచ్చని కన్నీళ్లు మనసుని పరిశుభ్రం చేసుకుని, వాయిల్ చీర కట్టుకుని వచ్చిన పవిత్రకి తండ్రి స్వరం వినిపించింది.

"ఏంటి? పవిత్ర వచ్చిందా? ఎప్పుడు? ఎక్కడి నుంచి? ఎవరితో?" ఆశ్చర్యంగా ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తున్నాడు.

"అల్లుడు బస్ ఎక్కించాడుట. మనల్ని చూడాలని వచ్చింది. స్నానం చేస్తోంది" అంటోంది వర్ధని.

పవిత్ర కళ్ళు తెరిచిన క్షణం నుంచీ, నెల క్రితం వరకు ఏ తండ్రి దగ్గర గారాలు పోయిందో, ఏ తండ్రి దగ్గర మారాము చేసిందో, ఏ తండ్రితో పోట్లాడిందో, ఏ తండ్రితో కబుర్లు చెప్పిందో ఇప్పుడు అదే తండ్రిని పలకరించడానికి కూడా ధైర్యం చేయలేకపోయింది. పవిత్ర రావడం చూసిన వర్ధని "అదిగో రానే వచ్చింది" అంది.

ఆయన చివ్వున వెనక్కి తిరిగి పవిత్రని చూసి, ఆమె దగ్గరగా వచ్చి వణుకుతున్న చేయి ఆమె భుజం మీద వేసి "ఎలా ఉన్నావురా?" అనడిగాడు.

వాత్సల్యం నిండిన ఆ స్వరం విన్న పవిత్ర చలించిపోయింది. "నాన్నా!" అంటూ ఆయన గుండెల మీద వాలిపోయింది.

ఆయన కూతురి వీపు నిమురుతూ "బాగున్నావా తల్లీ. అల్లుడు బాగా చూసుకుంటున్నాడా?" అన్నాడు.

పవిత్ర వెక్కి, వెక్కి ఏడుస్తూ "లేదు నాన్నా నేను మోసపోయాను. అతను దుర్మార్గుడు, వంచకుడు" అన్నాననుకుంది. కానీ మాటలు రాలేదు. ఏడుస్తూ తల ఊపింది.

"ఎందుకమ్మా ఏడుపు? ఆడపిల్లలు అన్నాక పెళ్లి చేసుకోవాలి... అత్తారింటికి వెళ్ళాలి... అక్కడ వంశాన్ని అభివృద్ధి చేయాలి. ఇది ప్రకృతి నిర్దేశించిన స్త్రీ ధర్మం. అది నువ్వు సక్రమంగా నెరవేర్చిన రోజు నేను గర్వపడతాను. ఏడవకు. నీ దగ్గర నుంచి ఒక ఫోన్ కానీ, ఉత్తరం ముక్క కానీ రాలేదని అందరం కంగారు పడ్డాం. పోనీలే వచ్చావు. నిన్ను చూసాము. హాయిగా ఉన్న నాలుగురోజులు ఆనందంగా గడుపు. సరేనా!" అన్నాడు ఆయన ఓదారుస్తూ.

ఆ మాటలు ఆమెకి ఓదార్పునివ్వలేదు సరికదా, మరింత ఉధృతంగా మారింది దుఃఖం.

వర్ధనికి అర్థం అయీ అవకుండా ఉంది. కూతురు దేనికో బాధపడుతోంది అనిపిస్తోంది కానీ ఎందుకో ఊహించలేకపోతోంది. ఎప్పుడూ నవ్వుతూ . అల్లరిచేస్తూ, పెంకెతనం చేస్తూ, గంతులేస్తూ ఉండే పవిత్ర మాత్రమే ఆవిడకి తెలుసు. ఇలా నిర్లిప్తంగా, విషాదం మూర్తీభవించినట్టున్న పవిత్ర తెలియదు. ఈ పవిత్ర కొత్తగా ఉంది... ఆవిడకి వింతగా, చింతగా కూడా ఉంది.

గుండెల్లో సన్నగా మొదలైన ఏదో అనుమానం, క్రమంగా గుండె మొత్తం ఆవరిస్తుంటే, పైకి చిరునవ్వు నవ్వుతూ, భోజనాలు ఏర్పాటు చేసింది. పవిత్ర కూడా కళ్ళల్లో భావాలు కనిపించకుండా, చిరునవ్వు అనే మాస్క్ వేసుకుని, తన సంసారం గురించి, తన భర్త గురించి గుచ్చి, గుచ్చి అడుగుతున్న నాయనమ్మకి, తండ్రికి కల్పించి, కల్పించి అందమైన కట్టుకథ అల్లి చెప్పి ఆనంద పరచింది.

ఆరాత్రి పడుకోడానికి అందరికీ గుడ్ నైట్ చెప్పి, తన గదిలోకి వెళ్ళిన పవిత్ర, గదిలో మంద్రంగా వస్తున్న సాంబ్రాణి పరిమళం గుండెల నిండా ఆస్వాదిస్తూ, "ఈ ఇల్లే నా ఇల్లు... ఈ గదే నా విశాల సామ్రాజ్యం... నేనిక్కడే పుట్టాను, నేనిక్కడే మరణిస్తాను". అనుకుంది.

మంచం మీద అడ్డంగా వాలి, మనసారా నవ్వుకుంది.

ఈ గదిలో ఎన్ని నిద్రలేని రాత్రులు అతని ఆలోచనలతో గడిపింది! ఎన్ని కలలు కంది ఈ మంచం మీద! ఎన్ని మధురోహలు తలపోసింది! ఏమైపోయాయి అవి? భగవంతుడా! ప్రేమ ఆడపిల్ల కళ్ళు మూయించినా, మనోనేత్రాలు మాత్రం తెరిచే ఉండనీ... ఆ నేత్రాలే ఏనాటికైనా కన్నవారి మమతలని గుర్తించగలవు.

మెత్తని తలగడ మీద ఒత్తిగిల్లింది. రెండు కన్నీటి చుక్కలు తలగడ మీద రాలాయి.

🦋🦋🦋

శివ, సరళ ఇల్లు చేరేసరికి రాత్రి పది దాటింది. కారు దిగిన సరళ, గుమ్మం దగ్గరకు వచ్చి చెప్పులు విప్పబోయి తూలి గోడని గట్టిగా పట్టుకుంది. శివ కారు పార్క్ చేసి వచ్చి, ఆమెని పట్టుకున్నాడు.

నవ్వుతూ "మరీ డోస్ ఎక్కువవుతోంది" అన్నాడు.

సరళ మత్తుగా నవ్వి అతని భుజం మీద తల వాల్చి, కుడిచేయి వయ్యారంగా పైకి ఎత్తి,కాలింగ్ బెల్ నొక్కింది.

కిటికీ తలుపు తెరిచే ఉంది. హాల్లో లైటు వెలుగుతోంది. లోపల నుంచి ఎలాంటి సవ్వడి లేదు.

"మొద్దు... అప్పుడే నిద్రపోతున్నట్టుంది." అంటూ మరోసారి బెల్ నొక్కాడు శివ.

అప్పటికే మంచి నిద్రలో ఉన్న వెంకటమ్మ ఉలిక్కిపడి లేచి, ఆవలిస్తూ, కళ్ళు నులుముకుంటూ వచ్చి తలుపు తీసింది.

ఆమెని చూడగానే, సరళ, శివ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"నువ్వు ఇంకా ఉన్నావేంటి? పవిత్రా! " వెంకటమ్మని ప్రశ్నిస్తూనే, కొంచెం గట్టిగా పవిత్రని పిలుస్తూ లోపలికి వెళ్ళబోయాడు.

"అమ్మగారు లేరండి" అంది వెంకటమ్మ.

చివ్వున వెనక్కి తిరిగి ఆమె మొహంలోకి సూటిగా చూస్తూ "లేదా? ఎక్కడికి వెళ్ళింది?" అనడిగాడు.

"అల్లమ్మగారింటికి గుడివాడ ఎల్లారండి... మరి నేను ఎల్లోత్తానండి... మీరొచ్చాక ఇల్లు అప్పచెప్పి ఎల్లమన్నారు నన్ను." గోడ చీర చెంగు సరిచేసుకుని, వెళ్ళడానికి ఉద్యుక్తురాలు అయింది.

"ఆగు..." గద్దించాడు శివ.

వెంకటమ్మ వణికిపోయింది.

"ఎందుకు వెళ్ళింది? ఎవరైనా వచ్చి తీసుకుని వెళ్ళారా? ఒక్కతే వెళ్ళిందా?" ఆమె కళ్ళల్లోకి తీవ్రంగా చూస్తూ ప్రశ్నించాడు.

"ఒక్కరే ఎల్లారండి... నానమ్మగారిని సూడాలని ఉందని చెప్పారు."

"నిజం చెప్పు. నువ్వు దానికి ఏం చెప్పావు?"

"నేనం చెప్పలేదండి." వణికిపోతూ అంది.

శివ క్రూరంగా చూస్తూ, "నువ్వేం చెప్పకపోతే దానికి ఒక్కతీ ఇంట్లో నుంచి బయటకు వెళ్ళే ధైర్యం ఎలా వస్తుంది? అసలు ఎందుకు వెళ్తుంది?" సరళ వైపు చూసి సాలోచనగా అని, తిరిగి వెంకటమ్మ వైపు చూసి, "నువ్వు తక్షణం ఈ ఇంట్లోనుంచి వెళ్ళిపో. మళ్ళీ ఇటు వైపు వచ్చావంటే మర్యాద దక్కదు. వెళ్ళు" అంటూ దాదాపు మెడ మీద చేయి వేసి బయటకు గెంటేసాడు. వెంకటమ్మ పరుగులాంటి నడకతో గబగబా వెళ్ళిపోయింది.

శివ పళ్ళు కొరుకుతూ, "సరళా! ఈపాటికి అది ఇంటికి వెళ్లి వాళ్ళమ్మకో, నానమ్మకో అంతా చెప్పేసి ఉంటుంది. ఎలా? వాళ్ళు ఎలా స్పందిస్తారో! కూతురునే సర్దుకుని బతుకు అని పంపించేస్తారో, నా మీద తగాదాకి వస్తారో. వాళ్ళు రాకముందే నేను అక్కడికి వెళ్లి వీలైతే

మర్యాదగా, లేదంటే జుట్టు పట్టుకుని లాక్కుని వస్తాను. నువ్వు తెల్లవారగానే మీ ఇంటికి వెళ్ళు. పరిస్థితి కొంచెం సర్దుకున్నాక వద్దువుగాని. మనం ప్రమాదంలో పడ్డాము". అన్నాడు.

"ఆ గుంట కి అంత ధైర్యం ఎలా వచ్చింది? ఒక్కతీ హైదరాబాద్ నుంచి గుడివాడ వెళ్ళిందా? అమ్మో! నేరజాణే!" అంది సరళ.

"ఆ జాణతనం ఎలా అణిచేయాలో నాకు తెలుసు... సరే నేను కారు తీసుకుని వెళ్తున్నాను. నువ్వు ఎలాగోలా వెళ్ళు. రేపు సాయంత్రం లోపల మళ్ళీ దాన్ని ఈ ఇంట్లో కట్టేయకపోతే నాపేరు శివ కాదు" అంటూ చేతిలో ఉన్న కారు తాళాలు అటూ, ఇటూ తిప్పుతూ కొన్ని క్షణాలు ఆలోచించి "ఎస్. వెళ్తాను." అంటూ వేగంగా గుమ్మం దాటాడు.

సరళ అతను వెళ్ళిన వైపు చూస్తూ, నెమ్మదిగా తలుపు మూసేసింది.

🦋🦋🦋

"పవిత్రా!" తల్లి స్వరం మధురంగా వినిపించింది.

పవిత్ర గబుక్కున లేచి కూర్చుని " రా అమ్మా" అంది.

ఆవిడ వచ్చి మంచం మీద పక్కనే కూర్చుంది.

"ఏమ్మా?" అడిగింది పవిత్ర.

"ఏం లేదు తల్లీ. నెలైంది నిన్ను చూసి. ఈ పద్దెనిమిదేళ్ళ లో మొదటిసారి నిన్ను విడిచి ఉన్నాను. రోజూ నీ గురించే నా ఆలోచనలు. నీ దగ్గర నుంచి ఒక ఉత్తరం రాలేదని ఎంత బాధపడ్డానో! ఎంత ఆందోళన పడ్డానో తెలుసా? నాన్న, నానమ్మ కూడా రోజూ నీ నుంచి వచ్చే ఉత్తరం కోసం ఎదురు చూసేవారు. మీ ఆయన ఫోన్ నెంబర్ కోసం నాన్న ఎంతో ప్రయత్నించారు. ఇప్పుడు నిన్ను చూస్తుంటే ఎంత సంతోషంగా ఉందో తెలుసా? ఈ ఒక్కరోజు నీ దగ్గర పడుకుందామని వచ్చాను"

తల్లి స్వరం– ఆ నిశ్శబ్దంలో ఆమె మనసు పొరల్లో దాచిన ఒక్కో దుఖపు పొరనీ విప్పుతుంటే ఒక్కసారిగా ఆవిడ గుండెల్లో ఒదిగిపోయి, వెక్కి, వెక్కి ఏడవసాగింది పవిత్ర.

ఆవిడ మనసులో ఉన్న అనేక అనుమానాలను ఆ ఏడుపు నివృత్తి చేసింది. ఆ కన్నీళ్లు చెప్పాల్సినదంతా చెప్పేసాయి. ఆమె ఆపాదమస్తకం వణికిపోయింది. వణుకుతున్న స్వరంతో అడిగింది"ఏమైంది?"

నెల రోజులుగా గుండెల్లో పేరుకుపోయిన అవమానం, కోపం, బాధ, భయం... అన్నీ ఆ తల్లి ఒడిలో కన్నీళ్లుగా కరిగిపోయాయి.

"ఎందుకిలా జరిగింది?" తనని తానే అడుగుతున్నట్టు అస్పష్టంగా గొణిగింది ఆవిడ.

"నా ఖర్మ... నా దురదృష్టం..." పవిత్ర మాట పూర్తి కాకుండానే, "కాదు" అని అరిచింది వర్ధని. "కాదమ్మా కాదు... నువ్వు దురదృష్టవంతురాలివి కావు. నువ్వు పుట్టిన తరవాత మా ఇంటికి మహాలక్ష్మి నడచి వచ్చింది. నిద్రలేచి నీ మొహం చూస్తే మీ నాన్నకి వ్యాపారంలో కలిసి వచ్చేది. నువ్వు మా గారాల తల్లివి. మా అనురాగ పంటవి".

"హు" విరక్తిగా నవ్వింది పవిత్ర. "మరి ఎందుకిలా జరిగిందమ్మా? నన్ను మనసారా, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించాను అన్నాడే, నేను లేకపోతె తనకి బతుకే లేదన్నాడే... ఎందుకిలా జరిగింది?" జాలిగా అడిగింది పవిత్ర.

"ఏదో పొరపాటు జరిగింది. ఒక్కసారి నాకు ఏం జరిగిందో విశదంగా చెప్పవూ!" అడిగింది ఆవిడ.

పవిత్ర కళ్ళు తుడుచుకుని ఆవిడ ఒడిలో తల పెట్టుకుని పడుకుని, చెప్పసాగింది.

ప్రేమగా, సున్నితంగా కూతురి జుట్టు సవరిస్తూ వింటున్న వర్ధని చేతులు అకస్మాత్తుగా బిగుసుకున్నాయి. తీవ్రమైన స్వరంతో అడిగింది "నిజమా నువ్వు చెప్పేది. వాడు అంత నీచుడా? తల్లిలాంటి ఆవిడతో– ఛీ, ఛీ" అంది.

"నాకూ వెంకటమ్మ చెప్పకపోతే తెలిసేది కాదు. ఇద్దరూ విచ్చలవిడిగా నా ఎదురుగా తిరుగుతున్నారు. ఆవిడ దాదాపు ఆయన దగ్గరే ఉంటుందిట. ఇదంతా ఏంటమ్మా? ఇలా కూడా ఉంటాయా సంబంధాలు? నాకంతా అయోమయంగా ఉంది. పెళ్లి అయిన దగ్గర నుంచీ ప్రతి జంటా పిల్లల కోసం కలలు కంటారు... ఏడాది, రెండేళ్ళు గర్భం రాకపోతే గుడులు తిరుగుతూ, పూజలు చేస్తూ పిల్లల కోసం తపిస్తారు. అలాంటిది నేను ఇంత త్వరగా తల్లిని అవుతున్నాను అని తెలియగానే ఆయన ఆనందంతో నాట్యం చేస్తారు అనుకున్నాను. అది లేకపోగా, నాకూ మోహన్ కీ అక్రమ సంబంధం అంటగట్టి నీచంగా మాట్లాడితే భరించలేకపోయానమ్మ."

వర్ధని పవిత్రని లేపి గట్టిగా కౌగలించుకుని, "ఎంత తప్పు చేసాను పవిత్రా! నాన్నగారిని నేనే ఒప్పించాను మీ పెళ్ళికి. నువ్వు మనసు పడ్డావని, కుర్రాడు అందగాడు, డాక్టర్ అని ఎంత గర్వ పడ్డాను. అయ్యో దేవుడా! ఇప్పుడెలా? ఏం చేయాలి?" వెక్కి, వెక్కి ఏడవసాగింది.

నిస్సహాయులైన ఆ స్త్రీలు ఇద్దరూ చీకట్లో తప్పిపోయిన బాటసారుల్లా భవిష్యత్తు బాట కోసం అన్వేషిస్తూ కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. ఇద్దరికీ కంటి మీద కునుకురాలేదు. తెలతెలవారుతుండగా ఇద్దరూ గాఢ నిద్రలోకి జారిపోయారు.

మర్నాడు ఉదయమే నిద్ర లేచి భార్య అలవాటుగా తెచ్చి ఇచ్చే కాఫీ కోసం ఎదురుచూస్తున్న మాధవ వంట గదిలో సవ్వడి లేకపోవడం చూసి, "ఏమైంది వర్ధనికి? కూతురు పక్కన పడుకుని, మైమరచిపోయిందా ?" అనుకుంటూ మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

గది తలుపులు లోపలి నుంచి గడియ వేసి ఉన్నాయి. టైం చూసాడు. ఎనిమిదిన్నర. వర్ధని ఇంతసేపు పడుకోడం తను ఎప్పుడూ చూడలేదు. వీళ్ళు రాత్రంతా కబుర్లు చెప్పుకుంటూ ఆలస్యంగా పడుకుని ఉంటారు. అనుకుంటూ తలుపు మీద నెమ్మదిగా తట్టాడు. రెండు,మూడు సార్లు తట్టినా సమాధానం లేకపోడంతో నాలుగోసారి కొంచెం గట్టిగా తట్టాడు. లోపల నుంచి ఎవరూ అని వర్ధని స్వరం బరువుగా వినిపించింది.

"వర్ధనీ! తలుపు తెరువు. టైం ఎనిమిదిన్నర " అన్నాడు.

కొన్ని క్షణాల తరవాత తలుపు తెరుచుకుంది. వర్ధని మొహం చూడగానే మాధవ నివ్వెరపోయాడు. కళ్ళు బాగా వాచి ఉన్నాయి. జుట్టు చిందర,వందరగా ఉంది.

"ఏమైంది వర్ధనీ? కళ్ళు ఎందుకంత ఎర్రగా, వాచి ఉన్నాయి. రాత్రంతా మేలుకున్నారా తల్లి కూతుళ్ళు?"

ఆయన్ని అల్లా చూడగానే వర్ధనికి అంతా గుర్తుకొచ్చింది. కళ్ళు కన్నీటి వరదలుగా మారకుండా నిగ్రహించుకుంటూ, తల వంచుకుని "ఏం లేదు. ఏదో మాట్లాడుకుంటూ ఆలస్యంగా నిద్రపోయాం. పదండి వస్తున్నాను" అంది.

ఆయన అపనమ్మకంగా చూస్తూ, "అవి నిద్రలేమి వలన ఎర్రబడ్డ కళ్ళలా లేవు. నెలరోజులు కనపడక కనపడిందని దాన్ని ఏడిపించి, నువ్వు ఏడ్చావా?" అన్నాడు.

వర్ధనికి దుఃఖం నిగ్రహించుకోడం కష్టం అయింది. ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో ఆయనకీ తెలియని రహస్యాలు ఆవిడ జీవితంలో లేవు. ఇప్పుడు ఈ భయంకర రహస్యం చెప్పాలి... చెప్పక తప్పదు...

బావురుమంటూ ఒక్కసారిగా ఆయన పాదాల మీద విరుచుకు పడిపోయింది.

ఆయన కంగారుగా భార్యని లేవనెత్తి "ఏం జరిగింది వర్ధనీ?" అనడిగాడు.

"ఏవండీ! అంతా అయిపోయింది..."

అప్పటికే వర్ధని ఏడుపు కిందకి వినిపించడంతో పారాయణ చేస్తున్న నాంచారమ్మ భగవద్గీత చేతిలో పట్టుకునే మెట్ల దగ్గరకి వచ్చి "వర్ధనీ!" అని పిలిచింది.

వర్ధని ఉలిక్కిపడింది. అత్తగారికి ఈ విషయం తెలిస్తే ఇంకేమన్నా ఉందా? ఈ వయసులో ప్రాణానికి ప్రాణం అయిన మనవరాలి జీవితం ఇలా అయిందని తెలిస్తే, ఆవిడ కుప్పకూలిపోతుంది.

గబుక్కున కళ్ళు తుడుచుకుని, "అత్తయ్యకి చెప్పకండి. ఆవిడ తట్టుకోలేరు. ఇలా రండి" అంటూ ఆయన చేయి పట్టుకుని లోపలికి లాగి తలుపు వేస్తూ "ఏం లేదు అత్తయ్యా! వస్తున్నాను" అని సమాధానంగా అరిచింది.

ఆయన అయోమయంగా చూడసాగాడు. ఆ సవ్వడికి లేచి కూర్చున్న పవిత్ర తల్లివైపు, తండ్రివైపు అవాక్కై చూడసాగింది.

వర్ధని భర్తకి, రాత్రి పవిత్ర చెప్పినదంతా చెప్పబోతుండగా కింద నుంచి మరోసారి నాంచారమ్మ స్వరం విన్పించింది. "పవిత్రా! మీ ఆయన వచ్చాడు. త్వరగా రా. వర్ధనీ అల్లుడు వచ్చాడు. కిందకి రా" అంటూ.

వర్ధని, పవిత్ర స్తంభించిపోయారు. మాధవ నిర్ఘాంతపోయాడు.

పవిత్ర ఒక్క దూకుతూ తల్లి దగ్గరకు వచ్చి వణికిపోతూ అంది. "అమ్మా! నేను రాను. కిందకి రాను".

మాధవ కూతురు వైపు, భార్య వైపు మార్చి మార్చి చూడసాగాడు.

ఏం జరిగింది? ఏం జరుగుతోంది? ఏం జరగబోతోంది?

రాత్రి కూతురు ఒంటరిగా రావడం ఏమిటి? తెల్లవారే సరికి అల్లుడు దిగడం ఏమిటి? వర్ధని గుండె పగిలేలా ఎందుకు ఏడుస్తోంది? అసలు ఇద్దరూ కలిసి ఎందుకు రాలేదు? పవిత్ర కాపురంలో ఎలాంటి తుపాను చెలరేగింది? ఎందుకు ప్రేమించి, పెళ్లి చేసుకున్న జంట, ఏ విషయంలో గొడవ పడ్డారు? పవిత్ర ఒంటరిగా ఎందుకు వచ్చింది? క్షణంలో ఆయనలో అనేక ఆలోచనలు.

ఏదో అనబోతున్న భార్యని వారిస్తూ, "ముందు కిందికి పద. అతను అల్లుడు హోదాలో మొదటిసారి మనింటికి వచ్చాడు. ముందు మర్యాదలు చూడు, సావకాశంగా ఏం జరిగిందో తెలుసుకుంటాను. నేను ఉన్నాను. సమస్యలు పరిష్కరిస్తాను. జీవిత సమస్యలు ఆవేశంలో పరిష్కరించుకునేవి కావు. పద " అని భార్య చేయి పట్టుకుని, కూతురు వైపు చూసి మృదువుగా అన్నాడు. "మొహం కడుక్కుని కిందికి రా తల్లీ. ఈలోగా అతనితో నేను మాట్లాడుతూ ఉంటాను"

పవిత్ర ఏమి మాట్లాడలేదు. స్థాణువులా నిలబడి పోయింది. వర్ధని కూతురు భుజం మీద ఓదార్పుగా తట్టి, భర్తతో కలిసి కిందికి వెళ్ళిపోయింది.

కింద నుంచి శివ స్వరం వినిపించింది. "బాగున్నారా మామ్మగారూ! పవిత్ర ఇంకా నిద్ర లేవలేదా?"

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS